

జాతరకు 494 బస్సులు

మేడారం సమ్మక్క జాతరకు ఖమ్మం రీజియన్ నుంచి 494 బస్సులు నడిపేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. 10లో



నచ్చితే నజరానా..

మట్టి మాఫియా విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరితో కొందరు వ్యాపారులు చెలరేగిపోతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 23°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఉష్ణోగ్రతల ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

12న మధిరలో గ్రీవెన్స్ డే


ఖమ్మం సహకారనగర్: ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి(గ్రీవెన్స్ డే)ను ఈనెల 12వ తేదీన మధిర నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మధిరలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గ్రీవెన్స్ డే జరుగుతుందని పేర్కొన్నారు. ఈమేరకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలోని జిల్లా మహిళా ప్రాంగణంలో తాత్కాలిక పద్ధతిపై మహిళా అధ్యాపకులను నియమించనున్నట్లు మహిళా ప్రాంగణం మేనేజర్ వి.విజేత తెలిపారు. కంప్యూటర్ ట్రెయినర్ పోస్టు కోసం డిగ్రీ లేదా పీజీడీసీఏతో పాటు ఇతర కంప్యూటర్ కోర్సులు పూర్తిచేసి బోధనలో ఐదేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. అలాగే, నర్సింగ్ ట్యూటర్‌గా బీఎస్సీ నర్సింగ్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూతో పాటు ఐదు నుంచి పదేళ్ల బోధన అనుభవం కలిగిన వారు ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేరోజు సాయంత్రం 4గంటలకు మహిళా ప్రాంగణంలో ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని, వివరాలకు నేరుగా కార్యాలయంలో లేదా 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

నేడు నవోదయ ప్రవేశపరీక్ష




కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించేందుకు శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9వ తరగతిలో ప్రవేశాలకు 746 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ, రిక్కాబ్ బజార్‌లోని బాలికల హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. అలాగే, 11వ తరగతి కోసం 1,289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, పాలేరులోని నవోదయ విద్యాలయ, కూసుమంచి ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కాగా, 9వ పరీక్ష ఉదయం 11.15నుండి మధ్యాహ్నం 1.45 వరకు, 11వ తరగతి పరీక్ష ఉదయం 11నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులు ఆధార్ కార్డు లేదా నివాస ధృవీకరణపత్రంతో 45నిమిషాల ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

15న జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష



ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన జూనియర్ లైన్‌మెన్(జేఎల్‌ఎం) అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఈనెల 15న నిర్వహించనునుట్లు ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. 2019లో విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా జూనియర్ లైన్‌మెన్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సంబంధించి మూడో దశలో ఇటీవల 23 పోస్టులకు పరీక్ష నిర్వహించగా 20 మంది హాజరయ్యారు. వీరిలో 10 మంది స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా, మరో 13 పోస్టులకు వెయిటింగ్‌లో ఉన్న అభ్యర్థుకు అవకాశం ఇచ్చారు. ఆయా అభ్యర్థులు ఈనెల 15న ఖమ్మం విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సమాచారం ఇచ్చారు.

అదనంగా 11.37 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సత్తుపల్లిరూరల్: గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి కొత్తగూడెం ఏరియాలో ఇప్పటికే 11.37 లక్షల టన్నుల బొగ్గు అధికంగా ఉత్పత్తి చేశామని ఏరియా జీఎం ఎం.శాలేంరాజు తెలిపారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో శుక్రవారం జరిగిన మల్టీడిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు రవాణా సైతం గతంతో పోలిస్తే 20.74 లక్షల టన్నులు అధికంగా చేశామని.. మిగిలిన సమయంలో మరింత రవాణా చేయడం ద్వారా గత ఏడాది రికార్డును అధిగమిస్తామన్నారు. వినియోగం పెరిగినందున నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని తెలిపారు. డీజీఎం యోహాన్, అధికారులు కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, కె.హనాసుమలత, శివకేశవరావు, కె.సోమశేఖర్‌రావు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు..



ఇసుక తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోతున్న వేంసూరు మండలం దుద్దెపుడిలోని తమ్మిలేరువాగు

సాక్షి నిఘా

జలాశయాల్లో అడ్డగోలుగా తవ్వకం, అమ్మకం

- కూపన్ల మాటున యథేచ్ఛగా దందా
- ఆనవాళ్లు కోల్పోతున్న వాగులు, వంకలు
- పరీవాహక ప్రాంతాల్లో పడిపోతున్న భూగర్భ జలాలు
- ప్రభుత్వ చర్యలతోనైనా అడ్డుకట్ట పడేనా?

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని వాగులు, వంకల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిపోతోంది. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతుండగా.. జలవనరులు ఆనవాళ్లు కోల్పోయి పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండానే కొందరు ఇసుక తరలిస్తుండగా.. మరికొందరు స్థానిక అవసరాలకు తహసీల్దార్లు జారీ చేసే కూపన్లను ఆసరాగా చేసుకుని అంతకు మించి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అప్పుడు తనిఖీలు, కేసులతో సరిపెడుతున్న యంత్రాంగం.. ఇసుక రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయలేకపోతోంది. తాజాగా ఇసుక అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను హెచ్చరించిన నేపథ్యాన జిల్లాలోనూ ఇసుక దందాకు చెక్ పడుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

అధికారిక అనుమతుల్లేవు..

జిల్లాలోని మున్నేరు, వైరా, కట్టలేరు, గంగదేవిపాడు నదులు, వాగుల పరిధిలో 20 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. అయితే, ఇక్కడి నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోగా వేలంపాటలూ నిర్వహించలేదు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, స్థానిక అవసరాల కోసమే ఇసుక తరలింపునకు తహసీల్దార్లు కూపన్లు జారీ చేస్తున్నారు. ఈమేరకు ముదిగొండ మండలంలో పెద్దమండవ, గంధసిరి, చింతకాని మండలంలో చిన్నమండవ, బోనకల్ మండలంలో మోటమర్రి, బ్రాహ్మణపల్లి, మధిర మండలంలో కంభంపాడు, చిలుకూరు, ఎర్రుపాలెం మండలంలోని సకినవీడు, చొప్పకట్లపాలెం క్వారీల నుంచి కూపన్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతి ఉంది.

ఇదే అదునుగా..

కొందరు అక్రమార్కులు కూపన్లు అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, సొంత అవసరాల పేరిట కూపన్లు తీసుకుని ఒక కూపన్‌పై పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విజిలెన్స్‌అధికారులు, పోలీసులు తరచూ తనిఖీలు చేస్తే ఇవి పట్టుబడే అవకాశమున్నా కొన్నిసార్లు మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో పట్టుపడిన ట్రాక్టర్లకు జరిమానా విధించి వదిలేయడంతో మళ్లీ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గత ఏడాది 40 కేసులు.. ఈ ఏడాది ఇప్పటి వరకు 45 కేసులు నమోదయ్యాయి. కొన్నిసార్లు నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లోనూ ఇసుక తరలిస్తున్నారు.

- వైరా మండలంలోని గరికపాడు, ఖానాపురం, నారపునేనిపల్లి, ముసలిమడుగు వద్ద వైరా నది నుంచి కొన్నేళ్లుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మండలంలో అధికారికంగా ఇసుక ర్యాంప్‌లు లేకున్నా అభివృద్ధి పనుల పేరిట ఇసుక తరలించడం పరిపాటిగా మారింది. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు పడిపోయి వ్యవసాయ భూములకు నీరు అందడం లేదు.
- వేంసూరు మండలంలోని తమ్మిలేరు వాగు, కట్టలేరు వాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. మండలంలోని పలు గ్రామాలతోపాటు ఆంధ్రా సరిహద్దు గ్రామాలకు నిత్యం ఇసుక రవాణా చేస్తున్నారు.
- కూసుమంచి మండలంలోని మల్లాయిగూడెం, రాజుతండా, రాజుపేట మధ్య పాలేరు నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలం కాస్నాతండా, గోళ్లపాడు గ్రామాల మీదుగా కూడా ఇసుక తరలుతోంది. తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరు, పాలేరు వాగుల నుంచి ప్రతిరోజు అక్రమంగా తలిస్తుండగా.. తహసీల్దార్, పోలీసులు చర్యలు తీసుకుంటున్నా రాత్రివేళ అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారు.
- చింతకాని మండలంలోని చినమండవ, తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి, బోనకల్ మండలంలోని మోటమర్రి వద్ద ఉన్న వైరా మున్నేరు నుంచి ఇసుక తరలిపోతోంది. ఇక ఎర్రుపాలెం మండలంలోని తక్కెళ్లపాడు, సఖినవీడు, రాజులదేవరపాడు, చొప్పకట్లపాలెంల్లోని కట్లేరు పరీవాహక ప్రాంతంలో కూపన్ల మాటున తవ్వకాలు చేపడుతున్నారు.
- మధిర, కల్లూరు, వైరా, ఖమ్మం తదితర ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ ట్రాక్టర్‌కు రూ.6 వేల నుండి రూ.8 వేల మేర సొమ్ము చేసుకుంటున్నారు.



నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లలో ముదిగొండ మండలం పెద్దమండవ మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వేసవి సమీపిస్తున్న తరుణాన మున్నేరులో నీరు అడుగంటగా ఇసుక రవాణా జోరందుకుంది. ఇసుక తరలించే సమయాన వాహనాలు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

మరెక్కడా ప్రమాదం జరగొద్దు..

- శిథిల భవనాలను ముందుగా గుర్తించండి
- ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలో గ్రంథాలయం కూలగా ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ భవనాలను ఇంజనీరింగ్ శాఖలు తనిఖీ చేసి రిజిస్టర్‌లో రిమార్కులు పొందుపర్చాలన్నారు. అలాగే, ఆయా భవనాల్లో కొనసాగుతున్న శాఖల అధికారులకు సూచనలు చేయాలని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న భవనాల కూల్చివేతకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌ఈలు శ్యాంప్రసాద్, చంద్రమౌళి, వివిధ శాఖల అధికారులు పాండురంగ విఠల్, నాగశేషు, తానాజీ, విజయనిర్మల, విజయలక్ష్మి, వేణుమనోహర్, సోమశేఖరశర్మ, రవిబాబు, జయప్రకాష్, జ్యోతి, అరుణ, ప్రత్యూష పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులపై కలెక్టరేట్‌లో శిక్షణ ఇవ్వగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. మాస్టర్ ట్రెయినర్లు శ్రీరామ్, మదన్‌గోపాల్ మాట్లాడగా అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఏఓ విజయనిర్మల, జిల్లా సంక్షేమ అధికారి సుమ పాల్గొన్నారు

ఎఫ్‌ఎల్‌సీకి తరలింపు

లోక్‌సభ ఎన్నికలకు జెడ్పీ ఆవరణలోని గోదాంలో ఉన్న అదనపు ఈవీఎంలను వినియోగించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈమేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షాన గోదాం తెరిచి ఈవీఎంలను కలెక్టరేట్ ఆవరణలోని గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ బీపాస్ ద్వారా త్వరగా అనుమతులు

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్ బీపాస్ విధానం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ అనుమతులు త్వరగా మంజూరవుతాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కేఎంసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశం జరగగా కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కేఎంసీ, మధిర మునిసిపాలిటీ పరిధిలో ఒక్కొక్కటి, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో 3, సుడా పరిధిలో 13 లేఅవుట్ల ఆమోదానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి గడువులోగా అనుమతులు జారీచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్‌ఈ శ్యాంప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, అధికారులు శ్రీనివాసులు, ప్రసాద్, వికాస్, వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ పాల్గొన్నారు.



లేఅవుట్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలి

ఖమ్మంమున్‌టౌన్: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కు గ్యాస్ సిలిండర్ అందజేయడానికి లబ్ధిదారుల గుర్తింపు కోసం క్షేత్రస్థాయి పరిశీలనను వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి ఖమ్మంలోని పలు డివిజన్లలో దరఖాస్తుల పరిశీలనను ఆయన తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. కేఎంసీ సహాయ కమీషనర్ సత్యనారాయణరెడ్డి, డీఈ నవ్యజ్యోతి పాల్గొన్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతిని సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకపూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహీపతి రామలింగం పాల్గొన్నారు.

క్యాథల్యాబ్ సేవలకు బ్రేక్

- డిప్యూటేషన్ రద్దుతో సొంత పోస్టుకు వెళ్లిన వైద్యుడు
- చికిత్స అందక రోగుల ఇక్కట్లు



పెద్దాస్పత్రిలోని కార్డియాలజీ విభాగం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తరచూ క్యాథల్యాబ్ సేవలకు అంతరాయం ఏర్పడుతుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాంట్రాస్ట్ ఇంజక్షన్ల కొరతతో పలుమార్లు సేవలు నిలిచిపోయాయి. ఇంతకాలం డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న గుండె వైద్యుడు సొంత పోస్టుకు వెళ్లిపోవడంతో సేవలకు పూర్తిగా బ్రేక్ పడింది. దీంతో యాంజియోగ్రామ్, స్టంట్స్, యాంజియో ప్లాస్టీ తదితర సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నిర్ణయంతో డిప్యూటేషన్లను రద్దు చేసినప్పటికీ కీలకమైన గుండెవైద్యుడి స్థానంలో ప్రత్యామ్నాయం లేకుండానే రిలీవ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.

రూ.7కోట్ల వ్యయంతో క్యాథల్యాబ్

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం రూ.7 కోట్ల వ్యయంతో క్యాథల్యాబ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురాగా, వందలాది మందికి స్టంట్లు, యాంజియోగ్రామ్, యాంజియో ప్లాస్టీ, ఫెరిఫెరల్ యాంజియోగ్రామ్, ఫేస్‌మేకర్, కోబా, రేనల్ యాంజియోగ్రామ్ తదితర సేవలు అందాయి. క్యాథల్యాబ్ మిషన్ అందుబాటులోకి వచ్చాక గుండె వైద్యనిపుణుడు సీతారామ్‌ను నియమించారు. అయితే, సాధారణ బదిలీల్లో భాగంగా గత ఏడాది ఆయనకు మంచిర్యాల బదిలీ కాగా.. ఖమ్మంలో అవసరాల దృష్ట్యా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రత్యేక చొరవతో డిప్యూటేషన్‌పై సీతారామ్‌ను ఇక్కడే కొనసాగిస్తున్నారు.

డిప్యూటేషన్ల రద్దుతో...

రాష్ట్ర ప్రభుత్వం వైద్య,ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల డిప్యూటేషన్లను గత బుధవారం రద్దుచేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, వైద్య విద్య విభాగాల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న వారిని అధికారులు రిలీవ్ చేసి సొంత స్థానాలకు పంపించారు. అదేక్రమంలో గుండె వైద్య నిపుణులు సీతారామ్‌కు కూడా స్థానచలనం కలగగా... ఆస్పత్రిలో క్యాథల్యాబ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కొత్త పేషంట్ల మాటేమో కానీ ఇన్‌పేషంట్లుగా ఉన్న పదిహేను మంది పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వైద్యుడు లేకపోవడంతో చేసేదేం లేక ఒక్కరొక్కరుగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లారు. నాణ్యమైన వైద్యం ఉచితంగా లభిస్తుందని ఇక్కడకు వస్తే ప్రస్తుత పరిస్థితులతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి రాగా.. ఆర్థికంగా భారం పడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే ఉన్న ఒక్క వైద్యుడిని పంపించటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి గుండె సంబంధించి వైద్య నిపుణుడిని నియమించే వరకు సీతారామ్ డిప్యూటేషన్‌ను కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

ఈసారైనా మంజూరయ్యేనా?

- వైరా రిజర్వాయర్ ఆధునికీకరణ నిధుల కోసం ఎదురుచూపులు
- గత పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- ఫలితంగా పనులకు అడ్డంకులు..
- డిప్యూటీ సీఎం భట్టిపై ఆయకట్టు రైతుల ఆశలు



వైరా మండలం పాలడుగు సమీపాన రిజర్వాయర్ కాల్వ పరిస్థితి

వైరా: గత ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయిస్తామంటూ రెండు సార్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో వైరా రిజర్వాయర్ రెండో విడత ఆధునికీకరణ పనులకు మోక్షం కలిగినట్లేనని రైతులు ఆశించారు. కానీ బడ్జెట్‌లో ప్రతిపాదనలతోనే సరిపెట్టిన ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. అయితే, వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి చెందిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగానే కాకుండా ఆర్థిక శాఖ మంత్రిగా ఉండడంతో శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రిజర్వాయర్ పనులకు నిధులు కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

వందేళ్ల చరిత్ర

వైరా రిజర్వాయర్ నిర్మించి సుమారు వందేళ్లు గడుస్తోంది. దీంతో ఆధునికీకరించాలని 16ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. 2008–2009 సమయంలో జైకా నుంచి రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 2010–11 ఏడాదిలో రిజర్వాయర్‌కు అదనంగా పెద్ద అలుగు నిర్మించారు. అంతేకాకుండా కుడి, ఎడమ కాల్వలకు సుమారు పదిహేను కిలోమీటర్ల వరకు గైడ్‌వాల్స్ నిర్మించారు.

మిగిలినవి రెండో దశలో...

పన్నెండేళ్ల క్రితం పూర్తయిన పనులన్నీ మొదటి దశగా గుర్తించారు. ఇవి కాకుండా అభివృద్ధి చేయాల్సిన కాల్వలు మరో 15 కిలోమీటర్ల మేర ఉన్నాయి. కుడి, ఎడమ ప్రధాన కాల్వలతో పాటు వీటి నుంచి పొలాలకు నీటిని అందించే సబ్ మైనర్ కాల్వలు అభివృద్ధి చేయాల్సి ఉంది. రెండో దశగా కుడి కాల్వలో 7.8 కి.మీ నుంచి 17వ కి.మీ వరకు గైడ్‌వాల్స్, ఇతర సబ్ డిస్ట్రిబ్యూటరీలకు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో ఇందుకోసం సుమారు రూ.40 కోట్ల అవసరమని అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు 2018–19 బడ్జెట్‌లో ప్రభుత్వం వైరా రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులకు రూ.39 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆతర్వాత 2019–20 బడ్జెట్‌లో రూ.27 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించగా.. ఇందులో రూపాయి కూడా విడుదల కాలేదు. అలా బడ్జెట్‌లో కేటాయింపులపై ప్రకటన చేయడం.. ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారడంతో రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులకు మోక్షం లభించలేదు. ఇక ఇప్పుడు ఆనాటి అంచనాలను మారుస్తూ నీటిపారుదల శాఖ అధికారులు రూ.86.80 కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించారు.

రిజర్వాయర్ వివరాలు	
ఆయకట్టు సామర్థ్యం	27 వేల ఎకరాలు
రైతులు	13,700
మొదటి దశ మరమ్మతులు	2009-11
నిధులు	రూ.55 కోట్లు
రెండో దశ పనులకు ప్రతిపాదనలు	రూ. 40 కోట్లు

గైడ్ వాల్స్ లేకపోతే జరిగే నష్టమిది..

గైడ్‌వాల్స్ లేక రిజర్వాయర్ కాల్వకట్టలు చాలాచోట్ల బలహీనంగా మారాయి. కోతకు గురై కొన్నిచోట్ల కాల్వ ఆనవాళ్లే కోల్పోయాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరందక రైతుల పంటలు ఎండిపోతున్నాయి. కాగా, గైడ్‌వాల్స్ నిర్మిస్తే నీటి వృథా తగ్గి ఆయకట్టు చివరకు నీటి ప్రవాహం వేగంగా ఉంటుంది. రైతులు పడుతున్న ఇబ్బందులు తగ్గుతాయని తెలిసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలవుతున్నాయి.


ప్రతిపాదనలు సమర్పించాం...



రిజర్వాయర్ చివరి ఆయకట్టుకు నీరు అందాలంటే కుడి, ఎడమ కాల్వలకు గైడ్‌వాల్స్ నిర్మించాలి. ఎడమ కాల్వ పరిధిలో 20.5 కి.మీ., కుడి కాల్వ పరిధిలో 5కి.మీ. మేర నిర్మాణానికి నిధులు కావాలి. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాం.

– శ్రీనివాస్, ఐబీ డీఈ, వైరా

నిధులొస్తేనే ఇబ్బందులు తొలుగుతాయి..



రిజర్వాయర్ అభివృద్ధి నిధుల మంజూరు కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు జరిగితే రైతుల ఇక్కట్లు తొలగుతాయి. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే రిజర్వాయర్ అభివృద్ధి జరిగింది.

– శీలం నాగిరెడ్డి, రైతు, దాచాపురం

క్లుప్తంగా

12న సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఈనెల 12న ఎంపిక చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. వయస్సు 16 ఏళ్లు దాటకుండా, 55 కేజీల లోపు బరువు ఉన్న క్రీడాకారులు వయసు ధృవీకరణపత్రం, ఆధార్ కార్డుతో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లు సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 91828 79460 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ముగ్గురు అనుమానితుల విచారణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 3వ డివిజన్ జయనగర్ కాలనీలో శుక్రవారం ముగ్గురు వ్యక్తులు స్వాముల దుస్తుల్లో చందాలు వసూలు చేస్తుండగా అనుమానంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం వాసులుగా తేలింది. ఎలాంటి పాత కేసులు లేవని నిర్ధారణ కాగా, కుల వృత్తిలో భాగంగా చందాలు అడుగుతున్నట్లు చెప్పడంతో వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

కారేపల్లి: అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను కారేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు శుక్రవారం ద్విచక్రవాహనంపై వచ్చి కారేపల్లి మండలంలోని భాగ్యనగర్‌తండా బొడ్రాసికుంట చెరువు కట్టపై తిరుగుతున్నారు. వీరిని బ్లూకోట్ కానిస్టేబుల్ సీతారాములు గుర్తించి దగ్గరకు వెళ్తుండగా పరారయ్యారు. దీంతో ఆయన ఎస్‌ఐ పి.రామారావుకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఎస్సై, సిబ్బంది చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. యువకుల వద్ద గంజాయి లభించగా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ఖమ్మం సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. అయితే, తాము బంధువుల ఇంటికి వచ్చామని యువకులు చెబుతున్నట్లు సమాచారం.

నచ్చితే నజరానా.. లేకుంటే జరిమానా!

- ఇదీ మట్టి మాఫియాపై అధికారుల తీరు
- ఫలితంగా పేట్రేగిపోతున్న అక్రమార్కులు
- ఇద్దరి చిన్నారులను బలి తీసుకున్న గుంతలు



సింగరేణి భూముల్లో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

సత్తుపల్లి: రాత్రింబవళ్లు తేడా లేకుండాదర్జాగా మట్టి రవాణా జరుగుతున్నా.. అడ్డుకోవడం తమ పని కాదన్నట్లు అధికారులు వ్యవహరిస్తుండడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. 'నచ్చితే నజరానా.. లేకుంటే జరిమానా' అన్న చందంగా అధికారుల తీరు ఉండడం విమర్శలకు తావిస్తోంది. మట్టి మాఫియా ఆగడాలను అరికట్టడంలో అధికారుల ఉదాసీన వైఖరిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు రాజకీయ ఒత్తిడి వచ్చినప్పుడల్లా తమ పని కాదంటూ తప్పించుకునే ధోరణిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక మాఫియాలోని పలువురి నడుమ ఆధిపత్య పోరుతో ఎక్కడ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే విషయం అధికారులకు క్షణాల్లో సమాచారం అందుతుండగా.. రాజకీయ అండ ఉన్న వారిని వదిలేయటం.. గిట్టని వారిపై చర్యలు తీసుకుంటున్నారనే అపవాదు మూటగట్టుకుంటున్నారు.

ఇద్దరి చిన్నారులు మృత్యువాత పడినా..

సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఓ రైతుకు చెందిన పొలంలో గ్రావెల్ మట్టిని భారీగా తరలించారు. దీంతో ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో నీరు చేరగా... ఇద్దరు చిన్నారులు ఇటీవల అందులో పడి మృతి చెందారు. అయినా అధికారులు తనిఖీల విషయంలో ఉదాసీనంగా ఉండడం ఇక్కడి పరిస్థితిని తెలియచేస్తోంది. సత్తుపల్లి మండలం రేజర్ల రెవెన్యూలోని సింగరేణికి అప్పగించిన భూముల్లోనైతే అడ్డూఅదుపు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు చేపడుతూ.. రాళ్లు వస్తే బాంబులతో పేలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇంత బరితెగించిన మట్టిమాఫియాను అదుపు చేయటంలో అధికారులు రాజకీయ ఒత్తిడితో మీనమేషాలు లెక్కిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.

మామూళ్ల పేరిట ధర పెంపు

అభివృద్ధి పనులు ఇళ్ల నిర్మాణానికి మట్టి అవసరం కావడంతో ఎంత ధర అయినా చెల్లించేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి ఉందని చెబుతూ వ్యాపారులు ధర అమాంతం పెంచి దోచుకుంటున్నారు. ఒకప్పుడు దూరాన్ని బట్టి టిప్పర్ మట్టిని సుమారు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు, ట్రాక్టర్ అయితే రూ.800 నుంచి రూ.900 వరకు తీసుకునేవారు. కానీ ఇప్పుడు టిప్పర్ మట్టి ధర రూ.3,500 నుంచి రూ.4వేలు, ట్రాక్టర్ మట్టికి రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారు. కాగా, అధికారులకు మామూళ్లు ఇవ్వాల్సి ఉందని వ్యాపారులు చెబుతుండడంతో యంత్రాంగంపై ప్రజల్లో చులకన భావం ఏర్పడుతోంది.

అనుమతులు ఉన్నాయా?

రైతు పొలంలో చదును పేరిట అనుమతి తీసుకుని బురిడీ కొట్టించటం మట్టి మాఫియాకు వెన్నతో పెట్టిన విద్య. వాస్తవానికి మట్టి రవాణాకు మైనింగ్ శాఖ అనుమతి ఇవ్వాలంటే పలు నిబంధనలు ఉంటాయి. ఆ నిబంధనలన్నీ పాటించి మట్టి అనుమతులు తీసుకురావడం ఎవరికైనా కష్టమేనని చెబుతారు. అందుకే పలువురు మట్టి అక్రమ రవాణాకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు అభివృద్ధి పనుల పేరిట మౌఖిక ఆదేశాలతో తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. ఇక వ్యాపారులకు రాజకీయ నేతల అండ ఉంటే బరితెగించి తవ్వకాలు జరుపుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారింది.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం



సన్మానం అందుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయులతో పీఆర్‌టీయూ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో కీలకంగా వ్యవహరిస్తున్న పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయులకు గౌరవం దక్కుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు పేర్కొన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1971లో సంఘం ఆవిర్భవించగా.. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా మండల, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు హక్కులు కల్పించేలా పోరాడామని గుర్తుచేశారు. కాగా, హక్కుల సాధనకే పరిమితం కాకుండా బాధ్యతలు సైతం నిర్వర్తిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించగా, 14మంది రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈసమావేశంలో సంఘం నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, కె.సైదయ్య, పి.వెంకటేశ్వరరెడ్డి, హరిత, జయమ్మ, విజయ్, అమృత్‌కుమార్, కట్టా శేఖర్‌రావు, హుస్సేన్, జీ.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, ఆర్.రంగారావు కోరారు. లేనిపక్షంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

● 'ఆశా'ల ఆందోళన



నిరసనలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్ వేతనాలు విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆశా కార్యకర్తలు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి పేరుకుపోయి సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని వారు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యాన భారీ సంఖ్యలో చేరుకున్న ఆశా కార్యకర్తలు నిరసన తెలిపాక కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, నాయకులు పి.రమ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సదరం స్లాట్ బుకింగ్ టైం పెంచాలి..

కారేపల్లిలో దివ్యాంగుల ఆందోళన



కారేపల్లిలో రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

కారేపల్లి: సదరమ్ క్యాంపులు మండల కేంద్రాల్లో కాకుండా జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తూ స్లాట్ బుకింగ్‌కు తక్కువ సమయం ఇస్తున్నారని ఆరోపిస్తూ కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో దివ్యాంగులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు మద్దతు తెలపడంతో అరగంట మేర ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 13న ఖమ్మం ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపుకు కారేపల్లి, కామేపల్లి మండలాల దివ్యాంగులను శుక్రవారం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారన్నారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి కారేపల్లికి వచ్చేసరికి పది నిమిషాల్లోనే బుకింగ్ ముగియడంతో 50మందికి పైగా మిగిలిపోయారని తెలిపారు. ఈమేరకు బుకింగ్ సమయం పెంచడమే కాక మండల కేంద్రాల్లో కూడా క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా, దివ్యాంగులు, నాయకుల ఆందోళనతో వాహనాలు భారీగా నిలిచిపోగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ పి.రామారావు చేరుకుని నచ్చచెప్పారు. అయినా వారు వినకపోగా వాగ్వాదం జరిగింది. చివరకు వారు ఆందోళన విరమించగానాయకులు కె.నాగేశ్వరరావు, కె.నరేందర్, వై.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనుమతి లేకుండా రాస్తారోకో నిర్వహించిన సీపీఎం నాయకులు కె.నాగేశ్వరరావు, కె.నరేందర్, వై.ప్రకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.జ్యోతి అన్నారు. సింగరేణి మహిళా కళాశాలలో శుక్రవారం విద్యాసంస్థల్లో 'లింగ వివక్షత'అనే అంశంపై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గరల్స్ కన్వీనర్ భవ్య అధ్యక్షత వహించగా జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, టెక్నాలజీ రంగాల్లో అమ్మాయిలు మరింతగా రాణించాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో, ఇతర పనిప్రదేశాల్లో విద్యార్థినులు, మహిళలు ఎదుర్కొంటున్న లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ఇంకా చాలా ప్రాంతాల్లో లింగ అసమానతలు చూపిస్తున్నారని, బాలికలు స్వేచ్ఛగా తిరగడానికి అనేక ఆంక్షలు విధిస్తుంటారని, పని, విద్య, వివాహం, సామాజిక బంధాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే వారి సామర్థ్యంపై పరిమితులను సమాజం విధించిందని విమర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు భయ్యా అభిమన్యు, సందీప్, నాగకృష్ణ, జిల్లా నాయకులు రామ్‌చరణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

16న విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యాన ఈనెల 16న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతూ నూతన విద్యావిధానాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ఇటుకల రామకృష్ణ, ప్రవీణ్, మస్తాన్, వెంకటేష్ తెలిపారు. ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగంపై పాలకులు అనుసరిస్తున్న వైఖరిని నిరసనగా బంద్ పాటించనున్నామని తెలిపారు. ఈ మేరకు మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు మద్దతు పలకాలని కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు రామకృష్ణ, కరుణ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణవాయిదాల సొమ్ము స్వాహా

రూ.4లక్షల మేర వాడుకున్న గ్రామదీపికలు?

కామేపల్లి: మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. సభ్యులు చెల్లించిన వాయిదాలను బ్యాంకులో జమ చేయకుండా గ్రామదీపికలు వాడుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన గ్రామదీపికలు ముత్తమ్మ, మంజుల శ్రీనిధి రుణ వాయిదా సొమ్ము సుమారు రూ.4 లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. సభ్యులు చెల్లించే వాయిదాలను పూర్తిగా బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారం తాజాగా బయటపడగా ఏపీఎం సురేంద్రబాబు జనవరి 8న గ్రామ దీపికలకు నోటీస్ ఇచ్చారు. అయినా వారు స్పందించకపోవడంతో ఏపీఎం ఆదేశాల మేరకు వారం తర్వాత గ్రామదీపికల నుంచి సీసీ వీరభద్రం రికార్డులు స్వాధీనం చేసుకున్నాడు. ఈ వ్యవహారం శుక్రవారం వెలుగు చూడడంతో సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ రైతు పొలం వద్ద పురుగుల మందు తాగి హత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని భైరవునిపల్లికి చెందిన రైతు నాగయ్య(55) శుక్రవారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన సహచర రైతులు ఆయనను నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అయితే, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

మైనర్ బాలిక...

మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన మైనర్ బాలిక(15) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రూ.8లక్షల విలువైన గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

ఖమ్మంక్రైం: ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.8లక్షల విలువైన ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఖమ్మంలో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు ఒడిశాలో కొనుగోలు చేసిన 30.5కేజీల గంజాయితో బయలుదేరారు. ఈమేరకు కొత్తబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి లభించగా అరెస్ట్ చేశారు. తనిఖీల్లో సీఐ సర్వేశ్వర్, ఎస్సైలు ముబషీర్, అహ్మద్, ఉద్యోగులు బాలు, హరీష్, వెంకట్, సుధీర్, హన్మంతరావు, విజయ,స్వరూప్, బేబి విజయ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్‌రోడ్డు మీదుగా ఈనెల 6న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రఘునాథపాలెం మండలం కామంచికల్లుకు చెందిన టైలర్ రుద్ర వెంకటేశ్వర్లు(64) ఖమ్మంలోని షాపు మూసేసి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు.

11పశువులు స్వాధీనం

కల్లూరురూరల్: ఏపీలోని తుని నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. బోలేరో వ్యాన్‌లో 11పశువులను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని హరీష్, ఎలమంచిలి మంగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షాకీర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



దగ్ధమైన వాహనం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఓ ఇంటి వద్ద నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. సత్తుపల్లి జవహర్‌నగర్‌లోని జంగాల కాలనీకి చెందిన రాయిన్ని కవలమ్మ ఇంటికి వేంసూరు మండలం చిన్నమల్లేలకు చెందిన బంధువు చింతల నాగరాజు ద్విచక్రవాహనంపై గురువారం వచ్చాడు. ఈక్రమంలో తన వాహనాన్ని ఇంటి ఎదుట పెట్టగా, శుక్రవారం ఉదయం చూసేసరికి పూర్తిగా కాలిపోయింది. కాగా, ఇదే ఇంట్లో రెండురోజుల క్రితం పెంపుడు కుందేలు పిల్లలు, నాటుకోళ్లు కూడా చోరీకి గురైనట్లు వెల్లడించిన బాధితులు.. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు చోరీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురయ్యాయి. పట్టణంలోని గుడిపాడు రోడ్డు కు చెందిన న్యాయవాది రాచూరి సీతారామయ్య ఇంటి ఆవరణలో పెట్టిన ద్విచక్రవాహనం, పాకలగూడెంకు చెందిన చిన్ని ఇంటి ఆవరణలో పెట్టిన ద్విచక్రవాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కెళ్లపాడు గ్రామంలోని రైతులు శీలం సీతారామిరెడ్డి, తల్లపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తల్లపురెడ్డి గోవర్ధన్‌రెడ్డి, తల్లపురెడ్డి సాంబశివారెడ్డికి చెందిన రూ.1.20 లక్షల విలువైన మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. ఈమేరకు శుక్రవారం గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

20క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కారేపల్లి: అక్రమంగా నిల్వ చేసిన సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని భీక్యా తండా గ్రామంలో ముగ్గురి ఇళ్లలో బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఈమేరకు 20క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని కారేపల్లి పోలీసులకు అప్పగించారు. అనంతరం శుక్రవారం సివిల్ సప్లయిస్ డీటీ విజయ్‌బాబు, ఆర్‌ఐ పవన్ పరిశీలించి ముగ్గురిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రేషన్ దుకాణంలో అప్పగించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి వద్ద ఓ ప్రైవేట్ బస్సు రోడ్డు పక్కన బోల్తా పడింది. హైదరాబాద్ నుండి శుక్రవారం 45మంది ప్రయాణికులతో బస్సు ఒడిషాకు వెళ్తుండగా పాస్నేకల్ వద్ద డ్రైవర్ నిద్రమత్తు కారణంగా రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికుడు మార్కం ఆకాష్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో తొమ్మిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు ఆకాశ్‌ను 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లిఫ్ట్ పైపు పగిలి నీరు వృథా



పైప్‌లైన్ పగలడంతో పోతున్న నీరు

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం నుండి చౌటపల్లి చెరువుకు నీరు చేసే లిఫ్ట్ పైపు శుక్రవారం పగిలిపోయింది. ఈ పైపులైన్ బండమీదితండా వద్ద పగలడంతో భారీ మొత్తంలో నీరు వృథాగా పోతోంది. అయితే, కొందరు రైతులు తమ పంటలకు నీరు అందించేందుకే పైప్‌లైన్‌ను పగులగొట్టారని స్థానికులు చెబుతున్నారు. ఏదిఏమైనాసంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పాపటపల్లి - జాన్‌పాడ్ రైల్వేలైన్ రద్దు చేయాలి



రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం శివారు పాపటపల్లి నుంచి సూర్యాపేట జిల్లా జాన్‌పాడు వరకు ప్రతిపాదించిన రైల్వేలైన్‌ను రద్దు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ మార్గంలో లైన్ నిర్మాణంతో రైతులు విలువైన పొలాలు నష్టపోతున్నందున ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన రైతు ప్రతినిధులు వల్లూరి పట్టాభి, బానోత్ చంద్రావతి, గుర్రం రాము తదితరులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతిపాదిత మార్గంలో దళిత, గిరిజన, పేద రైతులే ఎక్కువ ఉన్నందున భూములు కోల్పోతే జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈమేరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెల్లడించగా రైతులకు నష్టం జరగకుండా పరిశీలిస్తామని రైల్వే మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ వెల్లడించారు.

గార్ల రైల్వేస్టేషన్‌లో సమస్యలపై..

మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రిని ఎంపీ రవిచంద్ర కోరారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫాంలను విస్తరించడమే కాక డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, శాతవాహన, ఇంటర్ సిటీ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్యాట్రోల్ లీడర్ శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతృత్వాన రాష్ట్రంలోని పలు జిల్లాల కేడెట్లకు ఐదు రోజుల ప్యాట్రోల్ లీడర్‌షిప్ శిక్షణ శిబిరం కొత్తగూడెంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ శిక్షణను కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్‌లో సింగరేణి జీఎం పర్సనల్ కట్టా బసవయ్య ప్రారంభించి స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాక విపత్తుల సమయాన సేవలందించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సుశీల్‌కుమార్‌తో పాటు వివిధ జిల్లాల కేడెట్లు పాల్గొన్నారు.

మేడారం జాతరకు 494 బస్సులు



డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం ఆర్‌ఎం వెంకన్న

ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రణాళిక

- గతంతో పోలిస్తే 50 శాతం రద్దీ ఉంటుందని అంచనా
- ఈసారి ఇల్లెందు నుంచి గుండాల మీదుగా సర్వీసులు
- 66 కి.మీ. మేర తగ్గనున్న దూరం



మేడారం జాతర పాయింట్లు, బస్సుల వివరాలు

డిపో	పాయింట్	సర్వీసులు
ఖమ్మం	ఖమ్మం	30
	ఇల్లెందు	124
సత్తుపల్లి	ఏటూరునాగారం	34
	వెంకటాపురం	11
	చర్ల	10
మణుగూరు	మణుగూరు	25
	మంగపేట	10
కొత్తగూడెం	కొత్తగూడెం	130
	టేకులపల్లి	25
మధిర	పాల్వంచ	45
భద్రాచలం	భద్రాచలం	50
మొత్తం		494

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ కుంభమేళాగా పేరున్న ములుగు జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క – సారలమ్మ జాతకు వెళ్లే భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం రీజియన్‌లోని డిపోల ద్వారా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్దేశిత పాయింట్ల నుంచి బస్సులు నడిపించనున్నారు. 2020లో జరిగిన మేడారం జాతర రద్దీని పరిగణనలోకి తీసుకుని.. ఈ ఏడాది జాతరకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు.

'మహాలక్ష్మి'తో రద్దీ

2020 జాతరలో 1,33,141 మంది భక్తులు ఆర్టీసీ సర్వీసులు వినియోగించుకున్నారు. అయితే, ఈసారి మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో గతంతో పోలిస్తే 50 శాతం రద్దీ పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఈమేరకు ఖమ్మం రీజియన్‌లోని డిపోల పరిధిలో 11పాయింట్ల ద్వారా 494 బస్సులు నడిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఖమ్మం రీజియన్ నుంచి 130 బస్సులు వినియోగించనుండగా, నల్లగొండ రీజియన్ నుంచి 94, హైదరాబాద్ సిటీ రీజియన్ నుంచి 270 బస్సులు సమకూర్చుకుంటారు.

గుండాల మీదుగా..

గత మేడారం జాతరలో ఇల్లెందు నుంచి మేడారానికి మణుగూరు మీదుగా బస్సులు నడిపించారు. దీంతో 195 కి.మీ. మేర ప్రయాణించాల్సి వచ్చింది. ఇది దూరాభారం కావడంతో పాటు చార్జీలు కూడా పెరిగాయి. కానీ ఈసారి బస్సులను గుండాల మీదుగా నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మార్గంలో 129 కి..మీ. దూరమే ఉండడంతో 66 కి.మీ. తగ్గి చార్జీలు కూడా తగ్గనున్నాయి.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి.

మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నందున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న కోరారు. మేడారం జాతర ఏర్పాట్లపై రీజియన్ పరిధిలోని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో ఖమ్మం కొత్తబస్టాండ్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. కాగా, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మినహా ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సుల సమయాల్లో ఎలాంటి మార్పు ఉండదని, ఆయా సర్వీసులు యథావిధిగా నడుస్తామనే అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. కాగా, జాతర సమయాన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను కొన్ని రూట్లలో రద్దు చేసి, ఇంకొన్ని రూట్లలో ట్రిప్పులు తగ్గించాలని ఉంటుందని తెలిపారు. ఈనేపథ్యాన ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా ప్రచారం చేయాలని సూచించారు.

మేడారం సర్వీసుల సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్లు

డిపో	సెల్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979
ఖమ్మం పాత బస్టాండ్	99592 25965
సత్తుపల్లి	99592 25990
మణుగూరు	89853 61796
కొత్తగూడెం	99592 25982
మధిర	73829 25289
భద్రాచలం	99492 25987

నివేదికలు సమర్పించండి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్
- జీఎస్టీ, ముష్టిగింజల సేకరణపై సమీక్ష



జీసీసీపై సమీక్షలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ పరిధిలోని జీసీసీ ద్వారా నిర్వహిస్తున్న సొసైటీల్లో వస్తువుల ఆదాయపు పన్ను, జీఎస్టీ వివరాలతో పాటు ఏజెన్సీ ఏరియాలో ముష్టి గింజలు ఎక్కడెక్కడ సేకరిస్తున్నారో సర్వే చేసి ఈనెల 14లోపు నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన జీసీసీ మేనేజర్లతో సమావేశమయ్యారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలకు నాణ్యమైన సామాగ్రిని మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. అలాగే, ఆదివాసీ గిరిజనులు సేకరించే అటవీ ఫలాలను దళారులు దోచుకోకుండా జీసీసీకే విక్రయించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అశ్వారావుపేట మండలం వినాయకపురం, పాలవ్వంచలో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనుమతులు వచ్చినందున ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈసమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు భాస్కరన్, దావీద్, లక్ష్మాజీ, లక్ష్మణ్, నర్సింహారావు, ఖయ్యూం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడం అభినందనీయం

గిరిజన విద్యార్థులు గిరిజన ప్రజలకు సేవలందించేలా చైతన్యం కల్పించడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. మణుగూరు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన అశ్వాపురం మండలం గొందిగూడెంలో ఈనెల 12 నుండి 18వ తేదీ వరకు 70 మంది వాలంటీర్లతో శిబిరం నిర్వహిస్తుండగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ శుక్రవారం పీఓకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనులకు అవగాహన కల్పించడమే కాక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

నేడు, రేపు ప్ర.ర.వే. మహాసభలు

- ముఖ్యాంశంగా 'స్త్రీలపై ట్రోలింగ్'
- అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, మల్లీశ్వరి



మాట్లాడుతున్న అనిశెట్టి రజిత, పక్కన మల్లీశ్వరి, కాత్యాయనీ, రవిమారుత్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్ర.ర.వే) ఏడో మహాసభలను శని, ఆదివారం ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, కేఎస్.మల్లీశ్వరి తెలిపారు. ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్ర.ర.వే. ఏర్పాటు చేసి 15 ఏళ్లు పూర్తికాగా, ప్రతీ రెండేళ్లకోసారి వేదిక మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 'స్త్రీలపై ట్రోలింగ్' అంశంగా ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న వేదిక ఫంక్షన్ హాల్‌లో ఏడో మహాసభలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 200మంది సాహితీవేత్తలు, సామాజిక ఉద్యమకారులు, జర్నలిస్టులు పాల్గొననుండగా, సమాజాన్ని కలవరపెడుతున్న 'ట్రోలింగ్' అంశంపై చర్చ జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, కుల, మతతత్వ సంస్థలు, అప్రజాస్వామికులు భిన్నాభిప్రాయాన్ని అణిచివేయడానికి ట్రోలింగ్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, సమాజంలో ఏ చెడు ధోరణి తలెత్తినా ముందు బలయ్యేది స్త్రీలు, దళిత, మైనార్టీ తదితర పీడితులేనని తెలిపారు. ఈ సమస్యను సూక్ష్మ స్థాయిలో చర్చించి అర్థం చేసుకునేందుకు తమ వేదిక 'స్త్రీలపై ట్రోలింగ్'ను మహాసభల్లో ముఖ్యాంశంగా తీసుకుందని వెల్లడించారు. అనంతరం రవిమారుత్, కాత్యాయని విద్మహే, కొమర్రాజు రామలక్ష్మి, మువ్వా జయశ్రీ మాట్లాడుతూ మహాసభల్లో 'ట్రోల్' పుస్తక ఆవిష్కరణ ఉంటుందని, రెండోరోజు 'నారి సారించిన నవల' పుస్తకావిష్కరణతో పాటు పుస్తక సమీక్షలు, చర్చలు ఉంటాయని తెలిపారు. కాగా, సభల్లో సాహితీవేత్తలు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు ఓల్గా, ఘంటా చక్రపాణి, జీఎస్.రామ్మోహన్, పీఓడబ్ల్యూ సంధ్య, విమలక్క, ఉదయభాను, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, తులసి చందు, ఎస్.వేణుగోపాల్, ప్రొఫెసర్ కె.సునీతారాణి, కృష్ణకుమారి, కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి, అరుణ గోగులమండ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు సభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఏజెన్సీ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యం, వ్యక్తిత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ రితేశ్‌ఠాకూర్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సదస్సులకు బెటాలియన్ ఆధ్వర్యాన విద్యార్థులను తీసుకెళ్తుండగా 2023–24 ఏడాదికి గాను 260 మంది విద్యార్థులు ఎనిమిది రాష్ట్రాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శుక్రవారం సీఆర్పీఎఫ్ క్యాంపులో ఏర్పాటు చేసిన సమావేశంలో కమాండెంట్ రితేశ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల సంస్కృతిపై అవగాహన కల్పించడమే కాక విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం కోసం ఈ ప్రోగ్రాంను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు కమల్‌వీర్ యాదవ్, ప్రీత, సింగ్రవెల్, సోంజిత్ భకట్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయం

- మహబూబాబాద్ టికెట్‌కు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్
- కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్



గుండాల : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బలరాంనాయక్, పక్కన నాయకులు

టేకులపల్లి/మణుగూరు టౌన్/గుండాల: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ మాజీ ఎంపీ పోరిక బలరాం నాయక్ పేర్కొన్నారు. టేకులపల్లి, మణుగూరు, గుండాలల్లో ఏర్పాటుచేసిన సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ తనకు ఇచ్చేందుకు అధిష్టానం సుముఖంగా ఉందని.. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు అమలవుతుండగా, మిగిలిన నాలుగింటికి అమలుకు కసరత్తు జరుగుతోందని తెలిపారు. కాగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయాన కేంద్రియ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లతో పాటు పాటు 100 పడకల ఆస్పత్రులు, వేలాది గ్యాస్ కనెక్షన్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఇక అటవీ అధికారులు రైతులను ఇబ్బందులకు పెట్టకుండా.. వ్యవసాయ బోర్లు, కరెంటు లైన్లకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కాగా, బలరాంనాయక్ మణుగూరుకు వచ్చే సమాచారం లేకపోవడంతో ప్రజాభవన్ ప్రధాన గదికి తాళం వేసి ఉండటంతో బయటే విలేకరులతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈసమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు భూక్యా దేవా నాయక్, రెడ్యానాయక్, గుండా నర్సింహారావు, రాసమల్ల నర్సయ్య, నర్సింగ్ లక్ష్మయ్య, బోడ సరిత, బోడ మంగీలాల్, గాదె కేశవరెడ్డి, ఆవుల సర్వేశ్వరరావు, బానోత్ లక్ష్మణ్, షేక్ ఆరిఫ్‌పాషా, సామా శ్రీనివాసరెడ్డి. వెలగపల్లి జాన్, మహబూబ్, శ్రీను, లక్ష్మణ్, మెరుగు రవీంద్రనాథ్, కొండం ముత్యమాచారి, పొంబోయిన ముత్తయ్య, ఈసం పాపారావు, రాంనర్సయ్య, రమేష్, బొబ్బిలి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టేకులపల్లిలో జరుగుతున్న కనకన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని బలరాంనాయక్ సందర్శించి కాసేపు బ్యాటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు బోడ మంగీలాల్‌నాయక్, మూడు గణేష్, కత్తుల అఖిల్, బోడ సరిత, రెడ్యానాయక్, నర్సింగ్ లక్ష్మయ్య, సంజయ్, పూన్యా, గుండా నరసింహారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

'భారతరత్న'ం.. సర్వత్రా హర్షం !

- పీవీకి అత్యున్నత అవార్డు ప్రకటించిన కేంద్రం
- జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు
- పలుమార్లు జిల్లాలో పర్యటించిన మాజీ ప్రధాని



ఖమ్మంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న పీవీ (కుడి చివర)

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని పాములపర్తి వెంకటనరసింహారావు(పీ.వీ)కి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించింది. పీవీ రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని పదవులను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించి దేశ ప్రతిష్టతను ప్రపంచ వ్యాప్తంగా చాటారు. ఆర్థిక సంస్కరణల్లో కీలక పాత్ర పోషించిన బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడైన పీవీకి ఖమ్మం జిల్లాతోనూ అనుబంధం ఉంది. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు పలు మార్లు ఖమ్మం వచ్చారు. పీవీ బంధువులు పలువురు జిల్లాలో ఉండగా.. స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా 1998లో ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శీలం సిద్ధారెడ్డితోపాటు గెల్లా కేశవరావు, పింగళి తిరుపతిరావు, చేకూరి కాశయ్య, వనం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అలాగే, లక్ష్మీకాంతమ్మ ఖమ్మం ఎంపీగా పోటీ చేసినప్పుడు పీవీ ప్రచారం చేశారు. జిల్లాతో అనుబంధం కలిగిన పీవీ నర్సింహారావుకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీవీకి భారతరత్న ఇవ్వడం హర్షణీయం

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి/అశ్వారావుపేట రూరల్: దేశ ఆర్థిక రంగ పితామహుడు, తెలంగాణ బిడ్డ మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు భారతప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, సత్తుపల్లి, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించారని తెలిపారు. కాగా, పీవీ సేవలకు గుర్తింపుగా భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ పలుమార్లు కేంద్రాన్ని కోరిన విషయాన్ని వారు గుర్తుచేశారు.

ఆపత్కాలంలో ఆదుకున్న మహర్షి



దేశం ఆపత్కాలంలో ఉన్న సమయాన తనదైన శైలితో ఆదుకున్న మహర్షి పీవీ.నర్సింహారావు. దేశం ఆర్థికంగా బలోపేతమయ్యేలా పునాదులు వేశారు. బహు భాషా కోవిదుడైన పీవీ.నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించటం ఆనందంగా ఉంది.

– డాక్టర్ వనం కృష్ణవేణి, మాజీ కౌన్సిలర్

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు



ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని బలోపేతం చేసిన పీవీ భారతరత్న అవార్డుకు అన్ని రకాలుగా అర్హుడు. బహుబాషా కోవిదుడిగా, రాజనీతిజ్ఞుడిగా, పరిపాలనాధ్యక్షుడిగా ఆయన పేరు సాధించారు. కేంద్రప్రభుత్వం తెలంగాణ బిడ్డకు భారతరత్న ప్రకటించడం హర్షణీయం.

– మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, ఖమ్మం

దేశం గర్వించదగిన నేత



దేశం గర్వించదగిన నేత పీవీ.నర్సింహారావు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానిగా పగ్గాలు చేపట్టి అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. 1973లో రాజ్యాంగ సవరణల ద్వారా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన పీవీకి భారతరత్న రావడం అందరికీ గర్వకారణం.

– ఈశ్వరప్రగఢ హరిబాబు, హైకోర్టు న్యాయవాది, ఖమ్మం

తెలుగు ప్రజలకు గర్వకారణం



మాజీ ప్రధాని పీవీకి భారతరత్న అవార్డు ప్రకటించటం తెలుగు ప్రజలంతా గర్వించదగిన అంశం. దేశంలోనే తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన మహామనిషి పీవీ.బహు భాషా కోవిదుడైన ఆయన ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా పదవులకు వన్నె తెచ్చారు.

– సురావజ్ఝల వాసుశర్మ, అధ్యక్షుడు, జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం

సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

- బ్యాంకు ఉద్యోగులకు 45 రోజుల సంక్రాంతి బోనస్
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



మాట్లాడుతున్న చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ రెహమాన్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: సకాలంలో రుణాలు చెల్లించే వారికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ వర్తిస్తుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బ్యాంకు పురోగతి, రుణాల చెల్లింపు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న వారు నిర్దేశిత సమయంలో చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడు శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. కాగా, రబీ సీజన్ పంట రుణాల పంపిణీ కొనసాగుతోందని.. సీజన్ లక్ష్యం రూ. 520 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.118.01 కోట్లు మాత్రమే రెన్యూవల్ అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన రూ. 401.99 కోట్లను రైతాంగం రెన్యూవల్ చేసుకొని వడ్డీ రాయితీ పొందాలని చైర్మన్ సూచించారు.

లాభాల బాటలో బ్యాంకు

బ్యాంకులో తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టాక ఆర్థికంగా బలోపేతం కావడమే కాక 2020 నాటికి నష్టాల్లో ఉన్న బ్యాంకును లాభాల బాట పట్టించామని చైర్మన్ నాగభూషణం తెలిపారు. ఆనాడు రూ.116.31 కోట్లుగా ఉన్న మూలధనాన్ని రూ. 144.52 కోట్లకు పెంచామని, డిపాజిట్లు రూ.994.03 కోట్ల నుంచి రూ.1,111.19 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. అంతేకాకుండా పంట, విద్యారుణాలే కాక బంగారంపై రుణాలు భారీమొత్తంలో ఇచ్చామని తెలిపారు. ఇక లావాదేవీలు రూ.2,375.03 కోట్ల నుంచి రూ. 2,948.20 కోట్లకు పెరగగా... బ్యాంకు రూ.7.23 కోట్ల నష్టాల నుంచి రూ.15.78 కోట్ల లాభాల్లోకి చేరిందని వివరించారు. ఈ మేరకు ఉద్యోగులకు 45 రోజుల సంక్రాంతి పండుగ బోనస్ అందించనున్నట్లు చైర్మన్ తెలిపారు. అంతేకాకుండా సేవలను విస్తృతం చేసేందుకు ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, ఖమ్మం అర్బన్ మండలంలోని బల్లేపల్లి, నేలకొండపల్లి మండలం చెరువుమాదారం, వేంసూరు మండలం కందుకూరులో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం, డీజీఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఖమ్మం వేదికగా జరగనున్నాయి. ఖమ్మం నయాబజార్ పాఠశాల మైదానంలో ఆది, సోమవారాల్లో ఈ సభలు జరగనుండగా, ఏర్పాట్లు పూర్తికావొచ్చాయని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి తెలిపారు.

హాజరుకానున్న మంత్రులు

ఈనెల 11న ఆదివారం 10గంటలకు పతాకావిష్కరణతో సభలు ప్రారంభమవుతాయి. సభల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్కతో పాటు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. వివధ అంశాలపై సెమినార్ల తర్వాత సాయంత్రం మహాప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయి. ఇక సోమవారం 'అంతరాలు లేని విద్య, ప్రజల హక్కు – ప్రభుత్వ బాధ్యత' అంశంపై పలువురు ప్రసంగించనున్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హాజరయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం 12న ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటరాములు, డివీరభద్రంతో పాటు బి.వీరబాబు, బి.శివరావు, ప్రశాంత్, భద్రయ్య, సూక్యా, రవీందర్, శరత్, అరుణ, వాణిశ్రీ, సత్యనారాయణ, దేవ్‌సింగ్, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

మేడారం జాతరలో చోరీలకు వెళ్తూ పట్టుబడిన నిందితులు

ఖమ్మంక్రైం: మేడారం జాతర రద్దీని ఆసరాగా చేసుకోవచ్చని చోరీలు చేయొచ్చనే ఆలోచనతో వెళ్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర జేబు దొంగలు ఖమ్మంలో శుక్రవారం పోలీసులకు చిక్కారు. ఈమేరకు వివరాలను నగర ఏసీపీ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠా ములుగు జిల్లా మేడారంలో జరిగే జాతరలో రద్దీ ఉంటుందని.. సులువుగా చోరీలు చేయొచ్చనే భావనతో బయలుదేరారు. ఏపీ నుంచి రైలులో ఖమ్మం వచ్చిన వీరు అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. ఈమేరకు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన రావుల పార్వతి, రావుల రమణ, ఎల్.కోట మండలం రంగాపురానికి చెందిన దాసు యేసుమణి, దాసు యాకుబ్, ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం మాధవరానికి చెందిన మల్లాది సిద్ధరావు, కొమ్ము రాము, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంనకు చెందిన బూరుగు సత్యనారయణను ఖమ్మం వన్ టౌన్, త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని ఏసీపీ తెలిపారు. కాగా, నిందితులపై గతంలో 50 వరకు కేసులు ఉన్నాయని ఏసీపీ హరికృష్ణ వెల్లడించారు.